కంకర వేసి బీటీ మరిచారు

- ప్రమాదకరంగా నాగారం–పటేల్‌గూడెం రోడ్డు

లింగాలఘణపురం: మండలంలోని నాగారం నుంచి వయా లింగాలఘణపురం మండల కేంద్రం మీదుగా పటేల్‌గూడెం సూర్యాపేట రోడ్డు వరకు సుమారు ఎనిమిది కిలో మీటర్ల మట్టిరోడ్డు పీఎం జీఎస్‌వై–3లో బీటీ రోడ్డుగా మంజూరైంది. రూ.4 కోట్ల 55 లక్షలతో 2021 డిసెంబర్‌లో పనులు ప్రారంభించారు. మట్టి పనులు పూర్తి చేసి కంకర వేసి వదిలేశారు. కంకర వేసి నెలలు కావస్తున్న బీటీ వేయడం లేదు. నిబంధనల ప్రకారం సదరు కాంట్రాక్టర్ వచ్చేనెల మార్చి 12న పనులు పూర్తి కావాల్సి ఉండగా నేటికీ కంకరవేసి వదిలేశారు. అటు నాగారం నుంచే కాకుండా పటేల్‌గూడెం నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కంకరతేలి వాహనాలు బోల్తా పడేలా రోడ్డు తయారైంది. అంతే కాకుండా నాగారం, పటేల్‌గూడెం గ్రామాల నుంచి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు సైకిళ్లపై వచ్చే విద్యార్థులు కంకరతో జారిపడుతున్నారు. ఆటోల్లో వచ్చే విద్యార్థులు సహితం ఎప్పుడు ఏ ప్రమాదం ఏర్పడుతుందోనని ఆందోళనతో ప్రయాణిస్తున్నారు. వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తూ ద్విచక్ర వాహనాదాలు ఇబ్బంది పడుతున్నారు.



కంకర పోసి వదిలేసిన రోడ్డు

పనులు పూర్తి చేయాలి



మండల కేంద్రానికి మంజూరైన బీటీ రోడ్డు పనులు పూర్తి కాక కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. బీటీ రోడ్డు మంజూరైందనే సంతోషం ఉన్నప్పటికి పూర్తి కాకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళనతో ఉన్నారు. నిత్యం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులే కాకుండా మండల కేంద్రానికి వివిధ పనులపై వెళ్లే ప్రజలు, విద్యార్థులు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు వేసి పనులు పూర్తి చేయాలి.

– బొట్ల భాస్కర్, సర్పంచ్, నాగారం

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



జనగామ రూరల్: మన ఊరు–మనబడి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులతో ఎమ్మెల్యే రాజయ్య

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పసరమడ్లలో రూ.28 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాత్రి స్వప్న రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముత్తిరెడ్డి మాట్లాడారు. ముందుగా పాఠశాలలో చేపట్టిన కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, గార్డెనింగ్, ల్యాబ్‌ను పరిశీలించారు. ఎంపీపీ మేకల కలింగ రాజు, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్ రెడ్డి, జెడ్పీసీఈఓ వసంత, ఎంపీడీఓ హసీం, తహసీల్దార్ రవీందర్, ఎంపీఓ సంపత్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె విజయ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు బొల్లం శారద, ప్రధానోపాధ్యాయుడు దివాకర్‌రెడ్డి, నోడల్ అధికారి సత్యనారాయణ, పార్టీ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, ఉప్పలయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్య వజ్రాయుధం లాంటిది

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: విద్య వజ్రాయుధం లాంటిదని, చదువు సకల సమస్యలకు పరిష్కారమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.25 లక్షలు, ఘన్‌పూర్ ఎంపీపీఎస్‌లో రూ.46.35లక్షలతో, చిల్పూరు మండలం చిన్నపెండ్యాల , రాజవరం పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అన్నిటికన్నా ప్రధానమని, విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాము, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, సర్పంచ్‌లు పోగుల సారంగపాణి, తాటికొండ సురేష్, లింగారెడ్డి, ఎంపీటీసీలు కనకం స్వరూపగణేష్, దయాకర్, మారేపల్లి లలిత, మండల నోడల్ అధికారి ఎండీ.అజామొద్దీన్, నాయకులు మారేపల్లి తిరుమల, కనకం రమేష్, రాఘవరెడ్డి, యాదగిరి, ఎస్ఎంసీ చైర్మన్ బోసు శివ, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఉమసమ్మయ్య, ఎంపీఓ మధుసూదన్ ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి



ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

జనగామ రూరల్: మెడికో విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శనివారం పట్టణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం నాయకులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు స్వామి నాయక్, కౌన్సిలర్ అనిత, వాసు, చందు, ధర్మభిక్షం, హరిలాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారుకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించడంతోపాటు ఎంజీఎం సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు బానోత్ వసంత్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుతో ఆయన మాట్లాడారు. సైఫ్ వేధింపుల వల్లనే ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. నాయకులు లక్‌పనాయక్, రాజునాయక్, రవినాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కొడకండ్ల: గిరిజన వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిని మానసికంగా హింసించి ఆత్మహత్య యత్నానికి కారకులైన దోషులను చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన విద్యార్థి సేవాసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరావత్ సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువులో రాణిస్తూ పేద ప్రజలకు వైద్య సేవ చేయాలనే తలంపుతో ముందుకు సాగుతున్న ప్రీతిని సీనియర్ సైఫ్ మానసికంగా హింసించడం, ఫిర్యాదు చేసినా కూడా ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు పట్టించుకోకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని, దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రీతికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాన్ని కాపాడి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

పూడ్చిన కాల్వలో మట్టి తొలగింపు



మట్టి తొలగించిన కాల్వ

సాక్షి ఎఫెక్ట్..

లింగాలఘణపురం: మండలంలోని పాత చెరువులోని వచ్చే సాగునీటి కాల్వను పూడ్చివేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చిన మట్టిని తొలగించారు. ఈ నెల 23న సాక్షి దినపత్రికలో 'సాగునీటి కాల్వల పూడ్చివేత' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. కాల్వ పూడ్చివేసిన వారితో మట్టిని తొలగింపజేసి తిరిగి యథావిధిగా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇష్టారాజ్యానికి అధికారులు చెక్ పెట్టడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ నీటిపారుదల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా దుర్గామాతకు బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

బచ్చన్నపేట: మండలంలోని కొన్నెలో దుర్గామాతకు గ్రామస్తులు శనివారం వైభవంగా బోనాలను చేశారు. దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా ఆయా కులస్తులు తమ కులదైవాలకు బోనాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేళ ఆలయం వద్ద దుర్గామాత కథాపురాణాలను చెప్పి కల్యాణం నిర్వహించారు. గ్రామంలో అల్లర్లు చోటుచేసుకోకుండా ఎస్సై సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ వెంకట్ గౌడ్, ఎంపీటీసీ నర్సవ్వ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే సర్కారు ధ్యేయం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నర్మెట: పల్లెల అభివృద్ధే కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎంపీపీ తేజావత్ గోవర్దన్ అన్నారు. మండలంలోని హన్మంతాపూర్‌లో రూ. 21 లక్షల ఉపాధిహామీ నిధులతో తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పగడాల విజయ నర్సయ్య, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్‌లతో కలిసి శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం అనంతరం కేసీఆర్ పాలనలోనే పల్లెల రూపురేకలు మారిపోయాయని అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి బాటపట్టారని తెలిపారు. పలుసంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కళ్యాణం మురళి, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు ఎల్లబోయిన నరేష్, సీనియర్ నాయకులు గుడికందుల నరహరి, హెండిగ కృష్ణ, కాల్వ శ్రీకాంత్, శెనిగరం నరేష్, మాలోత్ మంగ్యా, పరశురాములు, అరవింద్, అవినాష్, అశోక్, వినోద్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గొడిశాల రవి కుటుంబానికి రూ.10వేలు, గుగ్గిళ్ల అబ్బసాయిలు కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని శనివారం సర్పంచ్ దూసరి గణపతి అందజేశారు. గుగ్గిళ్ల హరికృష్ణ, యాదగిరి, ప్రభాకర్, ఆంజనేయులు, కృష్ణ, అనిల్, సుదర్శన్ ఉన్నారు.

చేయూత

అదేవిధంగా అనారోగ్యంతో మృతి చెందిన అబ్బసాయిలు కుటుంబానికి ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య క్వింటాల్ బియ్యం అందజేశారు. ఉపసర్పంచ్ ఎల్లమ్మ, వార్డు సభ్యులు యాకలక్ష్మి, అబ్బసాయిలు, నాయకులు రాజు, సత్తయ్య, యాదగిరి, కొంరయ్య ఉన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండకింది నర్సింహులు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి కొడవటూర్ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. సర్పంచ్ బాలగోని పర్షరాములుగౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, బుచ్చయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

సోలిపూర్‌లో..

తరిగొప్పుల: సోలిపూర్ గ్రామానికి చెందిన రైతు దండెం రవి ఫిట్స్ రావడంతో శుక్రవారం మృతిచెందాడు. కాగా, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

బియ్యం అందజేత..

మండలంలోని జాలుబాయి తండాకు చెందిన సభావత్ రంజీ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీనుతో కలిసి చదువుకున్న 2016 పదో తరగతి పూర్వవిద్యార్థులు 25 కేజీల బియ్యంను శనివారం అందజేశారు.

బండి సంజయ్‌కి వినతి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో పద్మావతి, గౌతమి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ స్థానిక వ్యాపారులు, ప్రజలు శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుభాష్, రాష్ట్ర ఐటీ సెల్ సభ్యులు శశిక్, కార్తీక్‌రెడ్డి, దళితమోర్చా జిల్లా అధికార ప్రతినిధి ప్రదీప్, శివునిపల్లి వార్డు సభ్యుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేఎం జాన్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

జనగామ: పట్టణంలోని దయానిలయం వసతి గృహంలో 1979 నుంచి 2022 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా దయానిలయం వ్యవస్థాపకులు డాక్టర్ కేఎం జాన్ జయమణి దంపతులు పాల్గొన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా ఇందులో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిసి రోజంతా ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు చింత శారద డిగ్రీ, వేల్పుల కవిత, జి. అన్నపూర్ణ, జి అనురాధ, జి.ప్రేమలత, విన్ స్టన్ ముద్దమల్లె, పాల్ విగ్, క్యారోలిన్ విగ్, హేజ్రా మెర్లిన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రాజేందర్

కొడకండ్ల: విద్యార్థుల అభివృద్ధిలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిమెట్టులో భాగంగా ప్రతీ నెల పరీక్షలు నిర్వహించి చదవడం, రాయడం నేర్పుతున్నామన్నారు. విద్యార్థులను క్రమంతప్పకుండా పాఠశాలలకు పంపిస్తూ ఇంటి వద్ద హోం వర్క్ చేసే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఎస్ఎంసీ చైర్మన్ అందె యాకయ్య, ఉపాధ్యాయులు కుసుమ రాజు, కవిత పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి

జనగామ రూరల్: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయలతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలని గానుగుపహడ్ ప్రధానోపాధ్యాయులు వంగాల రాజేందర్ అన్నారు. శనివారం గానుగుపహడ్‌లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసనం, ప్రవర్తన, పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం అమలు పలు అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయులు సోమయ్య, రవీందర్‌రెడ్డి, రమేష్, రవికుమార్, అంజిరెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు భారీగా తరలిరావాలి

లింగాలఘణపురం: ఈ నెల 27న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో జరిగే మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాసు కోరారు. శనివారం మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాసు అధ్యక్షతన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, వర్క్స్ కమిటీ చైర్మన్ నాగేందర్, భాగ్యలక్ష్మి, గణపతి, భూపాల్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాసు రెడ్డి, విజయ్‌భాస్కర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వంతో బీమా

జనగామ: జిల్లాలో జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియను గ్రామ గ్రామాన చేపడుతున్నట్లు ఉమ్మడి జిల్లా జనసేన యువజన విభాగం అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడో విడత సభ్యత్వ నమోదులో భాగంగా ఈ నెల10వ తేదీన మొదలైన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం 28న ముగుస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న జన సైనికుల కుటుంబాలను ఆదుకుని, అండగా నిలిచేందుకు ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్ లింక్ సరికాదు

జనగామ రూరల్: దేశంలో ప్రభుత్వ ,ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీఎం పోషణ్ పోర్టల్‌లో తప్పకుండా ఆధార్ కార్డు లింక్ చేయలని ఆదేశాలు జారీ చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఈ మేరకు ఆధార్ లింక్ ఆదేశాలను విరమించుకోవాలని శనివారం జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల పేద విద్యార్థులు ఇబ్బందు పడుతారని, చదువులకు దూరం అయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్ తదితులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సెమినార్‌ను జయప్రదం చేయండి

పాలకుర్తి: మనువాదం, రాజ్యాంగం అనే అంశంపై ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కాకర్ల బాబు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని మంచుప్పులలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కాకర్ల రమేష్, గోగుల లక్ష్మి, కాకర్లబాబు, పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తరిగొప్పుల: సీజనల్ వ్యాధులపై గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ అర్జుల రమాసంపత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అబ్దుల్‌నాగారంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నట్టల నివారణ మందు పంపిణీ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ నట్టల నివారణ మందు తాగించడం వలన గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ప్రియాంక, సత్తయ్య, సతీష్, కనకమ్మ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

జనగామ రూరల్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 10 వార్డు గిర్నిగడ్డ ప్రాంతలో గడప గడపకు కాంగ్రెస్ రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలు పంపిణీ చేశారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్, సత్యం, రాజు, శ్రీనివాస్, మజీద్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు శివారులో పేకాట ఆడుతున్న విషయ తెలుసుకున్న పోలీసులు ఎస్సై మాధవ్‌గౌడ్ ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 7 గురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.1,950 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిలిపారు. ఇందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


మొక్కలను రక్షించాలి

బచ్చన్నపేట: గ్రామాలలో వన నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించాలని ఎంపీడీఓ రఘు రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి వన నర్సరీ, పల్లె ప్రగతి పనులను పరిశీలించి మాట్లాడారు.

ఫ్రీజర్ బహూకరణ

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన మూలగుండ్ల ఉప్పల్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం కుమారులు అజయ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి రూ.45 వేల విలువ చేసే ఫ్రీజర్‌ను గ్రామ రెడ్డి సంఘానికి శనివారం బహూకరించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు బేతెల్లి మహిపాల్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, మూలగుండ్ల తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యుమోనియాతో బాలుడి మృతి



భాన్విక్‌శ్రీ (ఫైల్)

బచ్చన్నపేట: న్యుమోనియాతో బాధపడుతూ మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన బత్తిని నాగరాజు, అనూష దంపతుల కుమారుడు భాన్విక్‌శ్రీ (2) శనివారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. భాన్విక్‌శ్రీ న్యుమోనియాతో బాధపడుతున్నాడు. గతంలో రెండు సార్లు న్యుమోనియా వచ్చి వైద్యం చేయించగా నయమైంది. కానీ మూడో సారి వచ్చిన జబ్బు తగ్గలేదు. బాలుడికి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.25 లక్షలతో వైద్యం చేయించినా మృతి చెందాడు. ఈ విషయమై మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఎలాంటి జబ్బులు వచ్చినా నిర్లక్ష్యం చేయొద్దని, న్యుమోనియా ఊపిరితిత్తులను నాశనం చేస్తూ చివరకు ప్రాణాలను హరిస్తుందన్నారు. చిన్న పిల్లలున్న తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

భూ తగాదాలో పలువురికి తీవ్ర గాయాలు

బచ్చన్నపేట: భూ తగాదా విషయంలో జరిగిన గొడవలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని ఇటుకాలపల్లిలో కాస బీరమ్మ, భర్త ఐలయ్యతో, కాస పరుశరాములు, సిద్దులుకు భూ విషయంలో గొడవలు అవుతున్నాయి. ఈ విషయమై గతంలో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారించారు. శనివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద మళ్లీ ఇరువురి మధ్య గొడవ సంభవించింది. బీరమ్మ, ఐలయ్య, వారి మనుమడు బియ్య స్వామి కలిసి పారలు, గడ్డపారలు, గొడ్డళ్లతో దాడి చేయగా కాస పరుషరాములు, సిద్దులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన కాత గాలయ్య కడుపులో కణితితో గత కొన్ని రోజులుగా బాధపడుతుంది. చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.1 లక్ష 50వేల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యులకు శనివారం ఎల్ఓసీని అందజేశారు. సుధీర్, ప్రపుల్ల, ఉదయ్ కుమార్, రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీలో జిల్లా నాయకులు



జనగామ: ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగారాఘవ రెడ్డి, పీసీసీ సభ్యులు, మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్ ఎర్రమళ్ల సుధాకర్ తదితరులు పాల్గొని ఏఐసీసీ, టీపీసీసీ నేతలను కలిశారు.

అభివృద్ధికి సహకరించండి

బచ్చన్నపేట: గ్రామస్తులు అందరూ గ్రామాభివృద్ధికి సహకరించాలని.. అప్పుడే పల్లెలు పట్టణాలు అవుతాయని మన్‌సాన్‌పల్లి సర్పంచ్ పంజాల తార, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

పశువైద్యాధికారులు స్పందించాలి

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు జబ్బు సోకితే పశువైద్యాధికారులు సకాలంలో స్పందించడం లేదని మండలంలోని గంగాపూర్ సర్పంచ్ బందారం సుశీల అన్నారు. శనివారం మాట్లాడుతూ గ్రామానికి చెందిన పిట్టల శ్రీశైలం పాడి ఆవు జబ్బుతో భూమిపై నుంచి లేవడం లేదని ఈ విషయాన్ని మండల పశువైద్యాధికారికి ఫోన్ ద్వారా తెలిపినా రావడం లేదని అన్నారు. వేల రూపాయల విలువైన పాడి ఆవు మృతిచెందే స్థితిలో ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పశువైద్యాధికారి స్పందించకపోవడంతో ఆవులు మృతి చెందాయన్నారు. వైద్య వృత్తి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పశువైద్యాధికారులపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని పశువులకు వైద్యం సకాలంలో అందేలా చూడాలని కోరారు.

విరాళం అందజేత



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు శనివారం రూ. 30వేల నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నారగోని రాజు, సట్ల లింగయ్య మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి నిర్వహించే ఉత్సవాలకు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని అందులో భాగంగా శ్రీధర్‌రావు విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. నారగోని రవిచంద్ర, పంతం రాజు, మాచర్ల స్వామి, పంతం రాజ్‌కుమార్, మూల సంపత్, నంగునూరి రాజు ఉన్నారు.

బ్యాగు అప్పగింత



బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన తాళ్ల మధుప్రియ ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బ్యాగును కండక్టర్ అందించి తన నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. శనివారం మధుప్రియ యాదగిరిగుట్ట నుంచి కొన్నెకు యాదగిరిగుట్ట డిపో బస్సు ఎక్కి రాజపేటలో దిగింది. బస్సు దిగే తొందరలో హ్యాండ్ బ్యాగును బస్సులోనే మర్చిపోయింది. కాగా, బస్సులో బ్యాగ్‌ను గుర్తించిన కండక్టర్ వి.సిద్దిరాములు డిపో మేనేజర్ శ్రీనివాస్, అధికారి హుస్సేన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలుసుకున్న వారు బ్యాగులోని రెండున్నర తులాల బంగారం, వెయ్యి రూపాయల నగదును పోగొట్టుకున్న ప్రయాణికురాలు మధుప్రియకు తిరిగి అప్పగించారు. బ్యాగును అప్పగించిన డ్రైవర్ ప్రవీణ్, కండక్టర్ సిద్దిరాములను పలువురు అభినందించారు.